క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఆంక్షలు వివరిస్తున్న ఎస్‌ఐ హరికోటి శాస్త్రి

మండపేట: సంక్రాంతి పండగ వేళ మండపేట పట్టణం కొనుగోళ్లు, వ్యాపారాలు ఎక్కువగా ఉన్న తరుణంలో ఆటో డ్రైవర్లు, వాహన దారులు ట్రాఫిక్ నిబంధలను పాటించాలని టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. ఈ మేరకు పట్టణంలో వుండే పలు ఆటో యూనియన్ సంఘాలకు, అందులోని ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. మెయిన్ రోడ్డులోని ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న ఆటో స్టాండ్ వద్ద ఆటోవాలాలతో ఆయన సమావేశం నిర్వహించి ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శాస్త్రి మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణానికి ప్రయాణికులు, కొనుగోలుదార్ల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి , పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. ఇష్టానుసారం ఆటోలను నిలిపివేస్తే కుదరదన్నారు. మద్యం సేవించి ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శాస్త్రి హెచ్చరించారు. సమావేశంలో ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పీఈటీపై ఫిర్యాదు

మండపేట: విధి నిర్వహణలోఉన్న వ్యాయామ ఉపాధ్యాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారని మహిళా పోలీసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మండపేట పట్టణంలో జరిగిన కోనసీమ క్రీడోత్సవాల్లో మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఆటస్థలంలో ట్రాఫిక్ అదుపు చేయాలని ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు పేర్కొంటూ, దురుసుగా ప్రవర్తించారని, అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదు చేశారు. అయితే ఈ విషయాన్ని బయటకు రానివ్వకుండా మండల పరిషత్ అధికారులు చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది.

నూతన వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవాలి



విశ్రాంత అధికారి ఎంవీఆర్ మూర్తిని సత్కరిస్తున్న పీఎంపీ నాయకులు, సభ్యులు

రామచంద్రపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీలు నిరంతరం నూతన వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవాలని విశ్రాంత మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి సూచించారు. మండలంలోని ద్రాక్షారామ మార్కెట్ యార్డులో బుధవారం రామచంద్రపురం, కె.గంగవరం మండలాల ది పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సులో మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య రంగంలో పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం మూర్తిని ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ రామచంద్రపురం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, జిల్లా కార్యదర్శులు సూరంపూడి వీరభద్రరావు, పి.దేవానందం, రాష్ట్ర మీడియా కన్వీనర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, కె.గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రామకృష్ణ, కార్యదర్శి పున్నం రాము, జేవీవీ సూర్యనారాయణ, కోశాధికారి గుబ్బల సత్యనారాయణ, వినాయకకుమార్, రెండు మండలాల సభ్యులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

అయినవిల్లి: కిశోర బాలికలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం ఉండటం కోసం తల్లి దండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ జి.భీమారావు, సీడీపీఓ వై.విజయశ్రీ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం సీడీపీఓ వై.విజయశ్రీ అధ్యక్షతన జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యం, వారి పోషణ, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశాలపై శిక్షణ నిచ్చారు. మహిళా సంరక్షణ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ మెంబర్‌గా విశ్వనాథ్

సఖినేటిపల్లి: యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ మెంబర్‌గా మండలానికి చెందిన సదరు సంఘ ప్రతినిధి నల్లి విశ్వనాథ్ బుధవారం ఎన్నికయ్యారు. కాకినాడలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో ఈ మేరకు ఎన్నికైనట్టు ఆయన మీడియాకు చెప్పారు. కాగా సదరు సంఘ మండల అధ్యక్షుడిగా, కోనసీమ జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, కుటుంబ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శిగా పనిచేసినట్టు విశ్వనాథ్ చెప్పారు.

కృత్రిమ గర్భధారణతో ఎంతో మేలు

- మేలు జాతి పశుసంపదకు ఆస్కారం
- అధిక పాల దిగుబడి



కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహిస్తున్న పశువైద్యుడు

రామచంద్రపురం రూరల్: మేలు జాతి పశుసంపద కోసం కృత్రిమ గర్భధారణ మేలైన విధానమని రామచంద్రపురం మండల పశువైద్యాధికారి డా.మేడిశెట్టి కృష్ణార్జున తెలిపారు. మేలు జాతి పశువుల కోసం కృత్రిమ గర్భధారణ విషయాలను ఆయన 'సాక్షి'కి వివరించారు. అధిక పాల దిగుబడులు ఇచ్చే పశువుల జాతికి చెందిన ఆబోతుల వీర్యాన్ని ముందుగా సేకరించి భద్రపరుస్తారు. ఎదకు వచ్చిన ఆడ పశువుల గర్భంలోకి కృత్రిమ పద్ధతుల్లో ఆ వీర్యాన్ని ప్రవేశపెట్టి మేలు జాతి దూడలను పుట్టించడమే కృత్రిమ గర్భధారణ అని వివరించారు. విదేశీ ఆవు జాతికి చెందిన జెర్సీ హోల్‌స్టెయిన్(హెచ్ఎఫ్), స్వదేశీ జాతికి చెందిన గిర్, సాహిపాల్, తార్‌పార్కర్, గేదె జాతికి చెందిన ముర్రా, మెహసాన, జిప్సర్ బాది రకాల వీర్యం ద్వారా సంతానోత్పత్తి చేస్తున్నారు.

లక్షణాలు..

విదేశీ పశువుల వీర్యంతో పుట్టిన దూడలు అధిక పాల దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటాయి. కానీ రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండదు. వాటి జీవిత కాలం కూడా తక్కువగా ఉంటుంది. అదే స్వదేశీ జాతి పశువు వీర్యం వల్ల పుట్టిన దూడలు విదేశీ జాతుల కన్నా తక్కువగా పాల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటాయి. అయితే రోగ నిరోధక శక్తి మాత్రం ఎక్కువగా ఉండి జీవిత కాలం కూడా ఎక్కువగానే ఉంటుంది. అంతే కాకుండా స్వదేశీ జాతుల పశువుల పాలు, పేడ, మూత్రం కూడా అధిక పోషకాలు కలిగి ఉంటాయి. ఆయుర్వేద గుణాలు కలిగి ఉంటాయని భారతీయుల నమ్మకం. సంప్రదాయ పద్ధతుల ప్రకారం స్వదేశీ పశుజాతుల అభివృద్ధి మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగానే చర్యలు చేపడుతుంది.

వీర్యధారణ సమయం



సాధారణంగా ఆవులు ఒకటిన్నర సంవత్సరాలు నుంచి 3 సంవత్సరాల లోపు, గేదెలు అయితే 3 నుంచి 5 సంవత్సరాల లోపు ఎదకు వస్తాయి. ఇలా చూలు నిలిచే వరకు ప్రతి 18 నుంచి 21 రోజులకు ఎదకు వస్తూనే ఉంటాయి. ఈ ఎద సమయాన్ని గుర్తించి ఆ సమయంలో కృత్రిమ వీర్యధారణ చేయించాలి. ఎదకు వచ్చిన పశువు బిత్తరచూపులు చూస్తుంది. మతి స్థిమితంగా ఉండదు. మూత్రం కొద్దికొద్దిగా ఎక్కువ సార్లు పోస్తుంది. మానం నుంచి తీగ వస్తుంటుంది. మానం కూడా ఉబ్బి ఉంటుంది. పాడి పశువు అయితే పాలు తగ్గిపోతాయి. ఇతర పశువుల మీదకు ఎగబాకడం చేస్తాయి. ఈ ఎదకాలం 24 గంటల వరకు ఉంటుంది. ఎదకు వచ్చిన 12 నుంచి 18 గంటల్లోపే కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుంది.

తక్కువ ఖర్చుతో నికర ఆదాయం



వానపల్లిలో దుంప పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపేట: లంక, మెట్ట భూముల్లోని దుంప పంటల సాగులో శాస్త్ర, సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నికర ఆదాయాన్ని పొందవచ్చని ఉద్యాన శాస్త్రవేత్తలు తెలిపారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.లలితా కామేశ్వరి, డాక్టర్ వి.శివకుమార్, డాక్టర్ కె.రవీంద్రకుమార్, స్థానిక ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు బుధవారం మండలంలోని వానపల్లి పరిసర లంక భూముల్లో దుంప పంటలను పరిశీలించారు. అనంతరం వానపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో దుంప పంటల యాజమాన్యం, వ్యాపించిన తెగుళ్ల నివారణ చర్యలు, పంటల అధిక దిగుబడులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.వీరేష్, ఉద్యాన విస్తరణ అధికారులు రాజు, సౌమ్య, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలంటూ రాస్తారోకో



అంగర ఓఎన్‌జీసీ రహదారిలో రాస్తారోకో చేస్తున్న స్థానిక నివాసితులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామం ఊర చెరువు నుంచి ఓఎన్‌జీసీ సైట్ వరకూ ఉన్న ఓఎన్‌జీసీ కంకర రహదారిని సీసీ రహదారిగా మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ స్థానికులు బుధవారం రాస్తారోకో చేశారు. రహదారిలో వెళుతున్న వాహనాలను నిలిపివేసి గంట పాటు ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో షేక్ కరీం, యర్రంశెట్టి నాగేశ్వరరావు, మట్టా ఏడు కొండలు, కందుకూరి సత్యం, ఉండమట్ల వెంకటేశ్వరరావు, చాపల నవీన్, మోర్త గనికమ్మ, మందపల్లి శేషగిరి మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాలుగా స్థానికంగా ఓఎన్‌జీసీ సంస్థ నాలుగు బావులతో గ్యాస్ నిక్షేపాన్ని పొందుతుందన్నారు. సంస్థ సామాజిక కార్యకలాపాల్లో భాగంగా రహదారిని సీసీ రహదారిగా మెరుపర్చాలని దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. సంస్థ భారీ వాహనాలు రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయనీ, తరచూ ఛిద్రంకావడంతో తామంతా అదే రహదారిపై అవస్థ పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దశలో సంస్థ ప్రతినిధులు స్పందించి డిమాండ్లను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినా ససేమిరా అన్నారు. రహదారిపైనే వంటా వార్పూ చేస్తూ నిరసన కొనసాగించారు. అంగర ఎస్సై డి.రవికుమార్ ఘటనా స్థలంలో పరిస్థితిని పరిశీలించారు.

పాఠశాలల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

రామచంద్రపురం: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మున్సిపాలిటీ పాఠశాలల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపాలిటీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపాలిటీ వద్ద విద్యార్థులతో కలసి ధర్నా చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సిద్ధూ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 6 ఉన్నత పాఠశాలలు, 16 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని ఈ పాఠశాలల్లో బడుగు, బలహీన, పేద వర్గాల విద్యార్థులు వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. మున్సిపాలిటీ పాఠశాలల్లో టీచర్ పోస్టులు భర్తీ చేయక విద్యార్థులకు సరైన విద్య బోధన అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మెగా డీఎస్సీ హామీ ద్వారా 50 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లాల్ బహదూర్ శాస్త్రి బాలికల ఉన్నత పాఠశాలలో ప్లే గ్రౌండ్ కోసం గతంలో ధనకోటి లేఅవుట్ ఇస్తూ రామచంద్రపురం మున్సిపాలిటీ వారు తీర్మానం చేశారని, ఆ తీర్మానం అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం నాడు నేడు ద్వారా అదనపు తరగతి గదులు నిర్మాణాన్ని చేపట్టిందని కానీ ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే లాల్ బహదూర్ శాస్త్రి గరల్స్, హైస్కూల్, రత్నంపేట, చాకలిపేట, పిల్లా వారి హైస్కూళ్లలో అదనపు తరగతి గదులు తక్షణమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం పథకానికి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్స్ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కంప్యూటర్ టీచర్ నియమించాలని, ప్రతి స్కూల్‌కి జల్‌జీవన్ మిషన్ ద్వారా విద్యార్థులకు తాగునీరు అందించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ మేనేజర్ పీఎస్ఎన్ మూర్తికి అందించారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ ఎ.అంజలి, బి.సురేఖ, వి.సంహిత, పి.నాగదేవి, రిక్షిత రమణి, సదా లక్ష్మీదేవి, సీహెచ్ సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిద్ధూ తదితరులు

సందడిగా సంక్రాంతి సంబరాలు



మున్సిపల్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలు వేసిన ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి



కాజులూరు కోటి హైస్కూల్‌లో భోగిమంట వెలిగిస్తున్న విద్యార్థులు, నాయకులు

- తెలుగు సంస్కృతికి రంగవల్లులు ప్రతీకలు
- చైర్‌పర్సన్ దుర్గారాణి
- విజేతలకు బహుమతుల ప్రదానం

మండపేట: సంక్రాతి ముగ్గులు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిశాయి. కమిషనర్ రంగారావు సారథ్యంలో కార్యాలయం ఎదురుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, విద్యార్థినులు, యువతలు రంగురంగుల ముగ్గులతో చూపరులను ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థినులు అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ , వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు హాజరై సంబరాలను తిలకించారు. అనంతరం చైర్‌పర్సన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.

కాలేజీ గ్రౌండ్‌లో క్రీడలు

పట్టణంలోని ఏడిద రోడ్డు వేగుళ్ల సూర్యారావు జూనియర్ కళాశాల ఆటస్థలంలో నిర్వహించిన కోనసీమ క్రీడోత్సవాలు రెండో రోజు ఉల్లాసంగా సాగాయి. విద్యార్థులు వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే సత్యనారాయణమూర్తి, ఎంఈవో నాయుడు రామచంద్రరావు, కమిషనర్ రంగారావు, నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కాజులూరు: కాజులూరు కోటి హైస్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, గ్రామీణ పండగలు, సంప్రదాయాలను వివరిస్తూ హరిదాసుల వేషధారణలతో కీర్తనలు ఆలపిస్తూ వినూత్నరీతిలో విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా భోగిమంటలు వేసి గొబ్బెమ్మలు పెట్టి పిండివంటలు తయారు చేశారు. భోగిమంట చుట్టూ జానపదగేయాలు పాడుతూ నృత్యాలు చేశారు. పాఠశాలలోని పలువురు విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి చూపరులను ఆకర్షించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్, డేగల సతీష్, పలువురు స్థానిక అధికారులు, నాయకులు కార్యక్రమాన్ని తిలకించి విద్యార్థులను అభినందించారు. పోటీల్లో విజేతలకు పాఠశాల నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



హోరా హోరీగా సాగుతున్న క్రీడాపోటీలో విద్యార్థులు

కపిలేశ్వరపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. కోకోలో కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విజేతగానూ, అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల రన్నర్‌గానూ నిలిచాయి. కబడ్డీ పోటీలో కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల విన్నర్‌గానూ, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల రన్నర్‌గానూ, వాలీబాల్ పోటీలో వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విన్నర్‌గానూ, కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల రన్నర్‌గానూ, షటిల్ పోటీలో కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విజేతగానూ, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల రన్నర్‌గానూ నిలిచాయి. జూనియర్స్ 100 మీటర్లు రన్నింగ్ పోటీలో వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.సరళ, నల్లూరు పాఠశాల విద్యార్థి కె.ప్రవర్షిణి, కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.అమృతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. త్రోబాల్ జూనియర్స్ పోటీలో వల్లూరు విద్యార్థి డి.సరళ, అంగర విద్యార్థి జి.కుసుమ, నల్లూరు విద్యార్థి కె.ప్రవర్షిణి, లాంగ్ జంప్ జూనియర్స్ పోటీలో నల్లూరు విద్యార్థి ఎస్.కావ్య, వల్లూరు విద్యార్థి పి.కావ్య, కపిలేశ్వరపురం విద్యార్థి కె.నాగేశ్వరి, 200 మీటర్లు పరుగు పందెం జూనియర్స్ విభాగంలో కపిలేశ్వరపురం విద్యార్థి బి.అమృత, నల్లూరు విద్యార్థి కె.ప్రవర్షిణి, వల్లూరు విద్యార్థిని పి.కావ్యలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగం 100 మీటర్లు పరుగు పందెంలో నల్లూరు విద్యార్థి జి.రీతిక, వల్లూరు విద్యార్థి ఎస్.లీలావేణి, నల్లూరు విద్యార్థి బి.ధనలక్ష్మి, సీనియర్స్ లాంగ్ జంప్ పోటీలో వల్లూరు విద్యార్థి ఎస్.లీలావేణి, నల్లూరు విద్యార్థి పి.కల్యాణి, కపిలేశ్వరపురం విద్యార్థిని ఎ.టి.వర్షిణి, సీనియర్స్ 400 మీటర్లు పరుగు పందెంలో నల్లూరు విద్యార్థిని ఎస్.లీలావేణి, కపిలేశ్వరపురం విద్యార్థిని ఎస్.రాజేశ్వరి, సీనియర్స్ షాట్‌పుట్ పోటీలో కపిలేశ్వరపురం విద్యార్థిని పి.మహాలక్ష్మి, నల్లూరు విద్యార్థని జి.ప్రీతిక, కపిలేశ్వరపురం విద్యార్థిని డి.కల్యాణి ప్రథన, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారిని ప్రజా ప్రతినిధులు, ఎంఈఓ తాతారావు, ఉపాధ్యాయలు అభినందించారు.

పుంజుకొంటున్నాయ్..!

- సిద్ధమవుతున్న బరులు
- పుంజులను సిద్ధం చేసుకుంటున్న పందెంరాయుళ్లు
- మరో పక్క పందేలు నిర్వహించవద్దంటూ పోలీసుల ప్రచారం

రాయవరం: సంక్రాంతిని పురస్కరించుకొని కోడి పందేల నిర్వహణకు గ్రామాల్లో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పందేలకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందన్న ధీమాలో పందెంరాయుళ్లు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. పండుగ మూడు రోజులు పందాలు నిర్వహించుకునేందుకు అనధికారికంగానైనా అనుమతి లభిస్తుందన్న ఆశతో పందెం కోళ్లను సిద్ధం చేసుకున్నారు. మరో పక్క పోలీసులు కోడి పందాలు, జూదంపై ఉక్కుపాదం మోపుతామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. బరిలో ఎవరూ నిలిచి, ఎవరు గెలుస్తారన్నది లక్షల డాలర్ల ప్రశ్నగా మిగలనుంది.

నియోజకవర్గాల్లో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల పరిధిలో కోడి పందాల నిర్వహణకు పందెం రాయుళ్లు పావులు కదుపుతున్నారు. గతేడాది కూడా అనధికారికంగా మూడు రోజులు కోడిపందాలు జోరుగా సాగాయి. పోలీసులు షరా మామాలే అన్నట్టుగా కోడిపందేలపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని లంక గ్రామాలు, కపిలేశ్వరపురం గోదారిగట్టు, ద్వారపూడి, కేశవరం, రాయవరం, కూర్మాపురం, పేకేరు, పామర్రు, అద్దంపల్లి, కూళ్ల, మసకపల్లి తదితర గ్రామాల్లో కోడిపందాలు సాగాయి. కోడిపందేల ద్వారా లక్షల రూపాయాలు చేతుల మారాయి. ఈ ఏడాది కూడా కోడిపందాలు నిర్వహించుకునేందుకు పందెంరాయుళ్లు గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామశివార్లలో ఉండే తోటలు, ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పందేలు నిర్వహించేందుకు అనువుగా ఉండే స్థలాలను పందెం రాయుళ్లు పరిశీలన చేస్తున్నారు.

బరిలో నెగ్గేదెవరు..

కోడి పందేలు జరగనివ్వబోమంటూ పోలీసులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కోడిపందాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికల ఇప్పటికే పోలీసులు ఆటోలు పెట్టి గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేపడుతున్నారు. అయినా నిర్వాహకులు తమ తమ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. కత్తులు లేకుండా జట్టీ పందాలైనా నిర్వహించుకునేందుకు అనుమతి లభిస్తుందన్న ధీమాలో పందెంరాయుళ్లు ఉన్నారు. బరుల వద్ద వివిధ దుకాణాలు, బెల్ట్‌షాపులు పెట్టడానికి చిరు వ్యాపారులు సన్నద్ధమవుతున్నారు. ఈసారి బరిలో ఖాకీ గెలుస్తుందా కోడి గెలుస్తుందా అనేది సంక్రాంతి వరకు వేచి చూడాల్సిందే.

కఠిన చర్యలు తప్పవు



సంక్రాంతి పండుగ పేరు చెప్పి కొందరు పందేలకు కాలు దువ్వితే కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే నిర్వాహకులపై నిఘా ఉంచాం. గతంలో కోడి పందేలను నిర్వహించిన వారిని బైండోవర్ చేస్తున్నాం. ఇప్పటి వరకు 26 బైండోవర్ కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం. ఇప్పటికే మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం.

– డి.సురేష్‌బాబు, ఎస్సై, రాయవరం



కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)



కోడిపందేలు నిర్వహించొద్దంటూ ఆటోలో మైకు ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు